"వద్దుమరీ...అమ్మో... కొట్టకు... ఇంకెప్పుడూ రాయను."

రామం నిద్దట్లో పేలుతున్నాడు. రంగారావు గుండెలో ఆటంబాంబు పేలింది.

"నాన్నా, ఆ సూరికి డబ్బొచ్చింది. అందుకే నేనూ రాశాను. అమ్మా! కొట్టకే!"

రామం తల్లి అతన్ని పూరడించింది.

రంగారావు లెక్క వేశాడు. దాదాపు రెండు వందలు పోయుంటాయ్-చాలా అప్పులున్నాయి. అస్తమానం ఓపెనింగు-క్లోజింగు. ఆ 'పాటే' తన్ను రాజ్యమేలింది. ఆ న్యూయార్కు కాటన్ మార్కెట్ తనకూ, సంసార సుఖానికీ మధ్య అడ్డుతెరైంది. మళ్ళీ రామంఏదో అంటున్నాడు.

ఏడుస్తూ తెల్లారింది.రామం ఇంకాలేవనేలేదు.

"జీరో ఓపెనింగ్ వచ్చిందండి. మీరు తాని మీదేమీ కట్టలేదు. నాలుగు క్లోజింగుతప్పదు. ఆరు మూడైనాసరే—జీరో ఫోర్ గన్‌పాట్. ఎంతో కొంత కట్టేయండి. చాలామంది కట్టేవారు"అంటూ ఆచారి బిల్లుపుస్తకం తీశాడు.

"ఆచారిగారూ!...నేనీఆట పూర్తిగా మానుకున్నానండి. ఇంక ఆగొడవలు నాదగ్గరెత్తకండి. నాకుబుద్ధొచ్చింది. నామూలంగా ఇంట్లోఅందరూ జూదగాళ్ళైపోతున్నారు. వెళ్ళిపొండి."

రంగారావు మాటలువిన్న ఆచారి తెల్లమొహం వేసి జారుకున్నాడు.

ఈ మాటలువిన్న రామంతల్లి గబగబా పరుగెత్తుకుని వెళ్ళి రామాన్ని కౌగలించుకొంది. అర్థం కాని చూపులు చూస్తున్న రామం అమాయకంగా నవ్వాడు.

# సవ్యాపసవ్యాలు

## అవసరాల రామకృష్ణారావు

రామగోపాలం నేను పెళ్ళివారింటికి వెళ్ళేము.

పెళ్ళికూతురు, పెళ్ళికొడుకు మా యెదురుగా కూర్చున్నారు. ఇద్దరూ తీయగా, భారంగా ఎన్నో ఆశలతోనిండినట్టు ఒకరివైపుఒకరు చూస్తున్నారు. మా రామగోపాలం బాగా పాడగలడు. 'ఓపాట పాడండి" అన్నారు. అనడమే తడవుగా అందుకున్నాడు.

'ఇంతేనన్నా, బ్రతుకంతేనన్నా' పెళ్ళికూతురి కళ సగంతగ్గింది. పాటబాగుంది కాబట్టి మరోటి పాడమన్నారు.

"పాడుజీవితము, యవ్వనం, మూన్నాళ్ళ ముచ్చటలోయి" ఇక భరించలేక నేను ఆపెయ్యమన్నాను. రామగోపాలినికే కాదు యిలాంటి అసందర్భపు పాటలు వాయించడం బ్యాండువాళ్ళందరికీ తెలుసు. నా పెళ్ళినాడు "దూరదేశమేగెదవో పెండ్లికూతురా" అన్న వూరేగింపు పాట జన్మలో మరువగలనా?

* * *

నాకు బాగా జ్ఞాపకం. దొడ్డమ్మ పిల్లలిద్దరికీ జ్వరం. నామటుకు నాకు జలుబూ దగ్గూ అసలు వంట్లో బాగులేదు. మా పెదనాన్న వూళ్లోలేడు. వాచింగుకి నిడుబ్రోలు వెళ్ళేడు. ఈవిషయాలన్నీ అలా వుంచండి. ఇంటికి ఎవరో దూరపుచుట్టం మా దొడ్డమ్మ ఆడబడుచు కొడుకుట, వచ్చాడు అదేంఖర్మమో వచ్చిన మరునాడే పాపం అతనికి జ్వరం పట్టుకుంది.

జ్వరతీవ్రతచేత హాల్లో పడుకుని పడక్కుర్చీలో కూలబడ్డాడు. పిల్లలిద్దరూ అన్నంపెట్టమని అల్లరిపెడుతున్నారు. పోనీ కాస్తసాయంచేదాం, పిల్లల్ని లేద్దాం అని వంటింట్లోకివెళ్ళి చూశాను. నిలువునా నీరైపోయాను! ప్రపంచంలో యింత అపసవ్యపుమనుషు లుంటారా అనిపించింది. మా దొడ్డమ్మ పెసరట్లకూరట, చేసుకుంటోంది! పెసరపప్పు రుబ్బుకోవాలి, అట్లుచెయ్యాలి, అట్లన్నీ ముక్కలుగా కోసుకోవాలి, వేరే మసాలారుబ్బి పెట్టుకోవాలి! దొడ్డమ్మ మంచివైపే ఎంచుకుంది! చుట్టానికైనా వెరిచిందికాదని నాకు నవ్వొచ్చింది. ఇలాంటి మనుషులు లేరంటారా? కావలిస్తే రాజమండ్రీ రండి.

* * *

నిత్యజీవితంలోనే యిన్ని అసందర్భాలు కనబడుతూంటే వీలయినంతవరకూ వాటికి దూరంగా

వుండే సినిమాలలో అసందర్భాలు వేరే చెప్పుకోవడం అనవసరం. కొంపమునిగిపోతున్నా వెనకనున్న మ్యూజిక్ బృందానికీ, ప్రక్కనున్న ప్లేబాక్ గాయకికీ ముందుగా కనుసంజ్ఞ చేసి, గ్లిసరిన్ సహాయంతో, పెదిమలు కదపడం మన హీరోయిన్‌లకే చెల్లింది. ఈ విషయంలో ఆద్యంతాలు చవిచూసిన చిత్రరాజములు లేకపోలేదు. 'షయర్' అనే హిందీ చిత్రంలో హీరోయిన్ తను వెళ్ళేసరికి రైలు తప్పిపోయిందని ఒక టేపాట! ఇంక యీ సినిమాలలో వేళపట్టున కలలురావడమూ, చిటికెలో ప్రాణగండాలు గడవడమూ ఎవరికీ తెలియందికాదు. ఇంతెందుకు? కష్టసుఖాల్లో సరిగ్గా సరిపోయే పాటలు పాడే సాధు బాంధవుడులేని సినిమా లేదుకదా!

* * *

అడిగేవాడు లేకగాని పదిమంది చేశారని అపసవ్యం సవ్యమైపోతుంగా? నలుగురూ పుచ్చుకుంటూరని కట్నం అమాంతంగా మొగపిల్లల జన్మహక్కై ఊరుకుంటుందా? మా చిన్నాన్న గోపాలంతో అలా చెప్పుకోడం దేనికి?

"చూశావా నాయనా, పీడి కట్నంతో అప్పులుతీర్చి యిల్లుకడదామనుకున్నాను. తక్కువ కట్నమని కాళ్ళదగ్గిరకు వచ్చిన నిక్షేపంలాంటి మేనరికాన్ని వదులుకున్నాను. ఈ రాలుగాయి ఎంత అపసవ్యంగా ప్రవర్తించాడో చూడు. ఎవరో ఊరూ పేరూ లేనిదాన్ని తగిలించుకుని దాని అప్పులు తనపేర రాయించుకున్నాడుట. బాగుందా?" గోపాలానికి ఎవరిది అపసవ్యమో అర్థంకాలేదు.

* * *

నిత్యమూ అమావాస్య అయిన ఆ యిల్లు ఆవాళ దీపావళి కూర్చుంది. ఆ బీదకుటుంబం అన్నాళ్ళకిఓసారి సంతోషంగా కలుసుకోవడమైంది.

"ఆరె మూళ్ళ చాపులు మూడు వేయించమని ఆర్డరిచ్చాను. బట్టలకరువు కొంతైనా తీరాలి" అన్నాడు తండ్రి:

"సోమయ్యదగ్గర నిత్యం కట్టుకోడానికి నేత చీరలు ఓ అరడజనూ, పిల్లలకి తెల్లవాయిలు ఓ ఎనిమిది గజాలూ అడ్డీగా పుచ్చుకున్నాను ఏకంగా యిచ్చెయ్యవచ్చును ఎన్నాళ్ళని యిబ్బంది పడతాం?" అంది తల్లి.

"ఇందరికి యిన్ని విధాల హక్కున్నప్పుడు ఆ మాత్రం స్వాతంత్ర్యం నాకులేదా, యింట్లో మంచికీ చెడ్డకీ అవుతున్న ఆయనకి లేదా? ఈ మధ్య ఆయనవంట్లో అసలు బాగులేదూ. నేనే స్వయంగా వెళ్ళి మళ్ళీ స్టాకువుండదని మూడు ఓవల్టీను డబ్బాలూ, రెండు గ్లాక్సోజు పెద్ద టిన్నులూ నాన్నపేరున పద్దులో రాయించి తెచ్చేశాను. ఏం తమ్ముడి అదృష్టం అక్కడి కాదా? వాడికి అయిదువేలు ప్రైజువస్తే అందులో నేనీ మాత్రం స్వల్పఖర్చుచెయ్యడం అన్యాయమా?" అంది కూతురు. ఇలా అనుకుంటూండగా ఉత్తరం వచ్చింది.

"మన దరిద్రం యీ విధంగానేనా తీరనందుకు విచారంగా ఉంది. నాకు వచ్చిన థర్డ్ ప్రైజు ఎక్కువమంది పంచుకోవడంచేత నలభై రూపాయిల కన్న లభించలేదు. ముందుగా సంతోషంతో చేసిన ఖర్చులవలన ఈ నలభై కాక నూరురూపాయిలు అప్పు అయింది. వెంటనే టి. యం. వో చెయ్యకపోతే జైల్లోనే కలుసుకోడం."

మనం ఒక్క చెమట బిందువు ఖర్చుపెట్టం. ఏ రూపాయో అర్థో వేస్తే వేలకివేలు కొట్టుకు రావాలి. ఈ ఆలోచన ఎంత సిగ్గులేనిది! ఇంత అపసవ్యపు అంచనాకి సుఖాంతం ఎలా వస్తుంది?

* * *

విధి విధించిన అపసవ్యాలుకాక మనం తెచ్చిపెట్టుకున్నవీ, ఊహించినవీ ఎన్ననీ! నూరురూపాయిలలోగా పొట్ట పోషించుకోమని శాసించి తద్వారా భావి పౌరుల యుక్తాయుక్తాల్ని నిర్ణయించడం ఎంత అనుచితం! ఊరిలో నాలుగు పేటల దారులూ సరిగ్గా తెలియని మొద్దు పెద్దమ్మలచేత ప్రపంచచరిత్రలు కల్లెవేయించి, పరీక్షలద్వారా మంచీ చెడ్డలనీ ఏరడం ఎంత అసందర్భం! కాళ్ళూ చేతులూ ఉన్నవాళ్లు అడుక్కోడం, బుద్ధిమంతులు నోరు నొక్కుకోడం, నాయకులు కంఠంతో పెట్టుకువచ్చి అరవడం-యింటిదగ్గిర వారివారి భార్యలు చరచడం యిలా ఎన్ననీ! అమావాస్యనాటి చంద్రుడ్ని కళ్ళకు కట్టినట్టు వర్ణించగల కవులుగల మన దేశంలో ఎన్ని అసత్యాలు జరుగుతే వింతేముంది? ★